క్లుప్తంగా

9న జాతీయ లోక్ అదాలత్

మైలవరం: మైలవరం మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో మార్చి 9న మైలవరం కోర్టు పరిధిలో జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తామని మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, జడ్జి హరిబాబు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. లోక్ అదాలత్‌లో రాజీ పడటానికి అవకాశం ఉన్న సివిల్, క్రిమినల్, మనోవర్తి, బ్యాంక్ కేసులను కక్షిదారులు రాజీ చేసుకుని వారి విలువైన సమయం, డబ్బు ఆదా చేసుకోవచ్చన్నారు.

ఎన్‌ఎస్‌ఎస్ శిబిరం



నూజివీడు: పట్టణంలోని ఉద్యాన పాలిటెక్నిక్ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో మిట్టగూడెంలో నిర్వహిస్తున్న సేవా శిబిరంలో భాగంగా రెండో రోజైన శనివారం విద్యార్థులు పలు సేవా కార్యక్రమాలను నిర్వహించారు. దీనిలో భాగంగా నీటిని పొదుపుగా వాడుకోవడంపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. డ్రెయినేజీలో చెత్తచెదారం వేయరాదని, ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిగా మానివేయాలని వివరించారు. అనంతరం గ్రామంలోని వీధులను శుభ్రం చేశారు. కార్యక్రమంలో పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రత్తిపాటి విజయలక్ష్మి, అధ్యాపక సిబ్బంది పాల్గొన్నారు.

నేడు వైఎస్సార్ సీపీ ఆత్మీయ సమావేశం

ఇబ్రహీంపట్నం: వైఎస్సార్ సీపీ మండల స్థాయి ఆత్మీయ సమావేశం ఆదివారం సాయంత్రం జరుగుతుందని వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు బొంతా సాంబశివరావు, పట్టణ అధ్యక్షుడు జోగి రాము శనివారం తెలిపారు. స్థానిక ముత్తవరపు కల్యాణ మండపంలో జరిగే సమావేశానికి రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్, ఎంపీ కేశినేని నాని, నియోజకవర్గ ఇన్‌చార్జ్ సర్నాల తిరుపతిరావు ముఖ్య అతిథులుగా హాజరవుతారన్నారు. సర్పంచులు, ఎంపీటీసీలు, జెడ్పీటీసీ సభ్యులు, ఎంపీపీ, సచివాలయ కన్వీనర్లు, కౌన్సిలర్లు, గృహ సారథులు, పార్టీ వివిధ విభాగాల నాయకులు, కార్యకర్తలు హాజరు కావాలని ఆయన కోరారు.

ఆంజనేయస్వామి ఆలయంలో పూజలు



చాట్రాయి: సూరంపాలెం గ్రామంలోని అభయాంజనేయస్వామి ఆలయ వార్షికోత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి హనుమాన్ చాలీసా పఠించారు. బూరుగుగూడెం గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకులు గురవారెడ్డి అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో ఏపీ కో–ఆపరేటివ్ యూనియన్ రాష్ట్ర చైర్మన్ దేశిరెడ్డి రాఘవరెడ్డి, మండల పరిషత్ ఉపాధ్యక్షుడు పుచ్చకాయల సుబ్బారెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు కారంగుల వాసు, మిద్దె బాలకృష్ణ, పరసా చెన్నారావు, వనమా వాసు తదితరులు పాల్గొన్నారు.

రీసెంట్ ట్రెండ్స్ ఇన్ సాఫ్ట్‌వేర్‌పై సెమినార్

జూపూడి(ఇబ్రహీంపట్నం): రీసెంట్ ట్రెండ్స్ ఇన్ సాఫ్ట్‌వేర్ ఇంజినీరింగ్ అంశంపై స్థానిక నిమ్రా ఇంజినీరింగ్ కళాశాలలో శనివారం సెమినార్ జరిగింది. కేఎల్ యూనివర్సిటీ సీఎస్‌ఈ డిపార్ట్‌మెంట్ అసోసియేట్ ప్రొఫెసర్ గోగినేని కృష్ణచైతన్య రిసోర్స్‌పర్సన్‌గా హాజరై విద్యార్థులకు జావా, పైథాన్, ఐటీ టూల్స్ అంశాలపై అవగాహన కల్పించారు. అకడమిక్ డైరెక్టర్ నారాయణ మూర్తి, ప్రిన్సిపాల్స్ అక్బర్‌ఖాన్, అబ్దుల్ బాజీ, డైరెక్టర్ టీఎస్ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పరీక్ష ప్యాడ్‌లు పంపిణీ



తోటమూల(గంపలగూడెం): దాతల సహకారాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని వైఎస్సార్ సీపీ తిరువూరు నియోజకవర్గ సమన్వయకర్త నల్లగట్ల స్వామిదాసు అన్నారు. తోటమూల కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో ఇంటర్మీడియెట్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం, పదో తరగతి విద్యార్థులు 109 మందికి నరసాపురానికి చెందిన అల్లు గణపతిరెడ్డి సౌజన్యంతో పరీక్ష ప్యాడ్‌లు, పెన్నులు పంపిణీ చేశారు. ఇటీవల నిర్వహించిన ఇంటర్మీడియెట్ ప్రీ ఫైనల్, పదో తరగతి సమ్మెటివ్ పరీక్షల్లో ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచిన ఆరుగురు విద్యార్థులను సన్మానించారు. దాత అల్లు గణపతిరెడ్డి, గౌరసాని భాస్కర్‌రెడ్డి, జెడ్పీటీసీ కోట శామ్యూల్, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు చావా వెంకటేశ్వరరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి కావూరి వినయ్‌కుమార్, వైఎస్సార్ సీపీ నాయకులు ఎం. ఉమామహేశ్వరరెడ్డి, అల్లు కృష్ణారెడ్డి, కోట లక్ష్మీనారాయణ, ప్రత్యేకాధికారి ఎం. వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

కనులవిందుగా స్వామివార్ల కల్యాణాలు



శ్రీనివాసుని కల్యాణం చేస్తున్న అర్చకులు



వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవంలో పాల్గొన్న నివృతరావు కుటుంబ సభ్యులు

కన్యాదానంలో పాల్గొన్న 50 మంది దంపతులు

మెట్టగుట్ట(గంపలగూడెం): జిల్లాలో ప్రసిద్ధిగాంచిన మెట్టగుట్ట శేషాచల శ్రీనివాసస్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం శేషాచల శ్రీనివాసుడి కల్యాణం కనుల విందుగా నిర్వహించారు. బ్రహ్మోత్సవాల రెండో రోజు ప్రత్యేక కార్యక్రమాలను, ఎదుర్కోలు ఉత్సవాన్ని అర్చకులు తూమాటి యోగానందాచార్యులు, తూమాటి శ్యామసుందరాచార్యులు, అర్చకబృందంచే శాస్త్రోక్తంగా జరిపారు. పెండ్లికుమారుడైన శ్రీనివాసుని గరుడ వాహనంపై, అమ్మవార్లను పల్లకీలో ఉంచి కల్యాణ వేదిక వద్దకు తోడ్కొని వచ్చారు. అనంతరం భక్తులు స్వామి నామాన్ని పలుకుతుండగా మేళతాళాలు, సన్నాయిమేళాల నడుమ శ్రీదేవి, భూదేవి సమేత శ్రీనివాసుని కల్యాణం నూతన కల్యాణ మండపంలో అంగరంగ వైభవంగా జరిగింది. 50 మంది దంపతులు పీటలపై కూర్చుని కన్యాదానం చేశారు. స్వామి వివాహ విశిష్టతను, వివిధ ఘట్టాల ప్రత్యేకను అర్చకులు తెలిపారు. మధ్యాహ్నం భక్తులకు అన్నసంతర్పణ చేశారు. ఆలయ కమిటీ చైర్మన్ జొన్నల ప్రతాపరెడ్డి దంపతులు, ఎంపీపీ గోగులమూడి శ్రీలక్ష్మి దంపతులు, కమిటీ సభ్యులు, వివిధ గ్రామాల నుంచి భక్తుల అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



నెమలిలో వేణుగోపాలుని కల్యాణం

వైభవంగా వేంకటేశ్వరస్వామి కల్యాణం

మైలవరం: మైలవరంలోని ద్వారకా తిరుమల దేవస్థానం దత్తత దేవాలయం అలివేలు మంగతాయారు గోదాదేవి సమేత వేంకటేశ్వరస్వామి వారి వార్షిక కల్యాణం శుక్రవారం రాత్రి ఘనంగా నిర్వహించారు. దేవాలయ ధర్మకర్త, మైలవరం జమీందారు ఎస్వీఎన్ నివృతరావు కుటుంబ సభ్యులు పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. విశేష సంఖ్యలో భక్తులు హాజరయ్యారు. అలాగే స్థానిక శివాలయం వీధిలోని పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి వారి ఆలయంలో బ్రహ్మేంద్రస్వామి కల్యాణం శనివారం ఘనంగా నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. పెద్దసంఖ్యలో భక్తులు స్వామివార్లను దర్శించుకున్నారు.

నెమలి వేణుగోపాలుని కల్యాణం

నెమలి(గంపలగూడెం): నెమలి వేణుగోపాలస్వామి ఆలయంలో పౌర్ణమి సందర్భంగా శనివారం స్వామి కల్యాణం ఘనంగా నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు తిరునగరి గోపాలాచార్యులు, అర్చకబృందంచే సత్యభామ, రుక్మిణీదేవి సమేత వేణుగోపాలుని కల్యాణం శాస్త్రోక్తంగా జరిపారు. 12 మంది దంపతులు పీటలపై కూర్చుని కన్యాదానం చేశారు. ఆలయ సహాయ కమిషనర్ ఎన్. వెంకటసాంబశివరావు, భక్తులు పాల్గొన్నారు.



విస్సన్నపేటలో గోపయ్య, తిరుపతమ్మ అమ్మవారు

గోపయ్య, తిరుపతమ్మ కల్యాణం..

విస్సన్నపేట: స్థానిక సత్తుపల్లిరోడ్డులోని గోపయ్య సమేత తిరుపతమ్మ అమ్మవారి కల్యాణ మహోత్సవం శుక్రవారం రాత్రి వైభవంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని కల్యాణ మహోత్సవాన్ని వీక్షించారు. అనంతరం అన్నదానం చేశారు.

మైలవరంలో వైఎస్సార్ సీపీ జెండా ఎగురవేద్దాం

సర్నాల తిరుపతిరావు

జి.కొండూరు: ప్రతిపక్షపార్టీ అభ్యర్థి ఎంత బలవంతుడైనా మీ వెనక నేనున్నానని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి భరోసా ఇచ్చారని, మైలవరంలో వైఎస్సార్ సీపీ జెండా ఎగురవేద్దామని వైఎస్సార్ సీపీ మైలవరం నియోజకవర్గ ఇన్‌చార్జ్ సర్నాల తిరుపతిరావు అన్నారు. మండల కార్యకర్తల స్థానిక కమ్యూనిటీహాల్‌లో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ నెల్లూరి లీలాశ్రీనివాసరావు అధ్యక్షతన శనివారం జరిగింది. తిరుపతిరావు ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ నియోజకవర్గంలో పెండింగ్‌లో ఉన్న వర్కులు పూర్తి చేయడంతో పాటు పెండింగ్ బిల్లులను సైతం విడుదల చేసేందుకు ముఖ్యమంత్రి హామీ ఇచ్చారని చెప్పారు. ఊహించని రీతిలో అతి సామాన్యుడికి ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారని చెప్పారు. సమన్వయంతో పనిచేసి వైఎస్సార్‌సీపీని గెలిపించాలని కోరారు. నిత్యం ప్రజల్లోనే ఉంటూ పార్టీ విజయానికి కృషి చేస్తానని తెలిపారు. జగనన్నను మరోసారి ముఖ్యమంత్రిని చేసేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ అప్పిడి సత్యనారాయణరెడ్డి, సీనియర్ నాయకులు వేములకొండ సాంబశివరావు, కాజా బ్రహ్మయ్య, వేములకొండ రాంబాబు, వేములకొండ శ్రీనివాసరావు, గుమ్మడపు రవీంద్రరాణా, పుప్పాల సుబ్బారావు, మండల అరుణ, కందుల ఏసురాజు, యరమల విజశ్రీ, షేక్ హుస్సేన్, బెజవాడ వీరయ్య, మారాసి కోటయ్య, వేములకొండ విష్ణు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న తిరుపతిరావు

దివ్యాంగులకు అండగా ఉంటాం

నల్లగట్ల స్వామిదాసు

తిరువూరు: దివ్యాంగుల సంక్షేమానికి తమ వంతు కృషి చేస్తామని వైఎస్సార్ సీపీ తిరువూరు నియోజకవర్గ ఇన్‌చార్జి నల్లగట్ల స్వామిదాసు అన్నారు. స్థానిక ఆర్యవైశ్య కల్యాణ మండపంలో శనివారం దివ్యాంగుల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ప్రభుత్వం దివ్యాంగులను అన్నివిధాలా ఆదుకుంటోందని, పెన్షన్ల మంజూరు, ఎలక్ట్రానిక్ వాహనాల మంజూరు, విద్యార్థులకు స్కాలర్‌షిప్ సదుపాయాలను కల్పిస్తోందని తెలిపారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నవరత్న పథకాల్లో దివ్యాంగులకు ప్రత్యేక ప్రాధాన్యత ఇచ్చారని, వైకల్య ధ్రువీకరణకు గతంలో జిల్లా కేంద్రాలకు వెళ్లే పరిస్థితిని గమనించి ఏరియా ఆస్పత్రుల్లోనే సదరమ్ క్యాంపులు నిర్వహిస్తున్నారన్నారు. సచివాలయాల్లో సదరమ్ క్యాంపునకు స్లాట్ నమోదు చేసుకున్న దివ్యాంగులు తమకు తెలియజేసిన తేదీల్లో ఆస్పత్రికి వెళితే సర్టిఫికెట్ పొందవచ్చని చెప్పారు. తిరువూరు నియోజకవర్గంలో ఏ సమస్య ఉన్నా తనను సంప్రదిస్తే పరిష్కారానికి కృషిచేస్తానని స్వామిదాసు తెలిపారు. మాజీ జెడ్పీ చైర్‌పర్సన్ సుధారాణి, వైఎస్సార్ సీపీ దివ్యాంగుల విభాగం రాష్ట్ర అధ్యక్షుడు బందెల కిరణ్ రాజు, స్థానిక దివ్యాంగుల సంక్షేమ సంఘ ప్రతినిధులు కృష్ణ, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న స్వామిదాసు

గ్రూపు-2 పరీక్షల నిర్వహణకు సర్వం సిద్ధం

- పరీక్ష రాయనున్న 2,288 మంది అభ్యర్థులు
- నూజివీడు పట్టణంలో 7 పరీక్ష కేంద్రాల ఏర్పాటు

నూజివీడు: గ్రూపు–2 పరీక్షల నిర్వహణకు అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. నూజివీడు పట్టణంలో ఏడు పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఏడు పరీక్షా కేంద్రాలకు కలిపి 2,288 మంది అభ్యర్థులను కేటాయించారు. ఆదివారం జరిగే పరీక్షలకు ట్రిపుల్ ఐటీలో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రంలో 500 మంది అభ్యర్థులను, సారథి ఇంజినీరింగ్ కళాశాల పరీక్ష కేంద్రంలో 600 మంది, ఎస్ఆర్ఆర్ హైస్కూల్‌లో 200 మంది, జెడ్పీ బాలికల హైస్కూల్‌లో 200 మంది, శారదా జూనియర్ కళాశాలలో 300 మంది, ఎంటీ జూనియర్ కళాశాలలో 288 మంది, శ్రీ సిద్ధార్థ ఫార్మసీ కళాశాలలో 200 మందిని కేటాయించారు. శారదా కళాశాల, ఎంటీ ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రాన్ని ఏలూరు జిల్లా జెడ్పీ డెప్యూటీ సీఈఓ ఎస్.నిర్మలాజ్యోతి పరిశీలించారు.



నూజివీడులోని గ్రూపు-2 పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న జెడ్పీ డెప్యూటీ సీఈఓ నిర్మలాజ్యోతి

పరీక్షా సమయం ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు నిర్వహించనున్నారు. ఒక్కొక్క గదికి గరిష్ఠంగా 24 మంది అభ్యర్థులను కేటాయించారు. అభ్యర్థులు పరీక్ష సమయం కంటే పావుగంట ముందుగానే పరీక్ష కేంద్రంలోకి వెళ్లాలి. 10.15 గంటలకు గేట్లను వేసి, ఆ తరువాత వచ్చే అభ్యర్థులెవరినీ లోపలికి అనుమతించరు. ప్రతి పరీక్ష కేంద్రానికి చీఫ్ సూపరింటెండెంట్‌ను నియమించడంతో పాటు పర్యవేక్షకులుగా తహసీల్దార్, ఎంపీడీఓ క్యాడర్ అధికారులను నియమించారు.

ఘనంగా ధ్యాన నిలయం వార్షికోత్సవం



గంపలగూడెం: స్థానిక షిర్డీ సాయిబాబా ధ్యాన నిలయంలో శనివారం 24వ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. రామాలయం అర్చకులు దేవయజనం శ్రీధరాచార్యులు, రామాచార్యుల ఆధ్వర్యంలో గణపతి, దత్తాత్రేయ, ఆంజనేయస్వామి, సాయిబాబాలకు పంచామృతాలతో అభిషేకం, అనంతరం దేవతామూర్తులకు ప్రత్యేక అలంకరణ చేసి విశేష పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం అన్నదానం చేశారు. ధ్యాన నిలయం కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.

క్రీడాపోటీల్లో విద్యార్థుల ప్రతిభ



క్రీడాకారులను అభినందిస్తున్న అధికారులు, ఉపాధ్యాయులు

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): విజయవాడ చిల్డ్రన్స్ స్కూల్స్, ట్యుటోరియల్స్ ఆధ్వర్యంలో జరిగిన స్పోర్ట్స్ మీట్‌లో కొండపల్లి క్రాంతి హైస్కూల్ విద్యార్థులు ప్రతిభ చూపారు. 42 విభాగాలకు జరిగిన క్రీడా పోటీలకు గాను 22 విభాగాల్లో విజేతలుగా నిలిచి బహుమతులు సాధించారు. ఈ సందర్భంగా జరిగిన అభినందన కార్యక్రమంలో ఎంఈఓ సీహెచ్ పుష్పలత క్రీడాకారులను అభినందించారు. విద్యతో పాటు క్రీడల్లోనూ విద్యార్థులను ప్రోత్సహిస్తున్న పాఠశాల యాజమాన్యాన్ని అభినందించారు.

పార్థసారథికి నైతిక విలువలు లేవు

వైఎస్సార్ సీపీ నేతల ధ్వజం

నూజివీడు: నూజివీడు ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావును విమర్శించే అర్హత కొలుసు పార్థసారథికి లేదని, అతనికి నైతిక విలువలు లేవని వైఎస్సార్ సీపీకి చెందిన పలువురు ప్రజాప్రతినిధులు విమర్శించారు. స్థానిక ఎమ్మెల్యే కార్యాలయంలో శనివారం జెడ్పీ వైస్ చైర్మన్ గుడిమళ్ల కృష్ణంరాజు, ముసునూరు జెడ్పీటీసీ వరికూటి ప్రతాప్, మున్సిపల్ వైస్ చైర్మన్ కొమ్ము వెంకటేశ్వరరావు, క్రిస్టియన్ మైనారిటీ విభాగం జిల్లా అధ్యక్షుడు పిళ్లా చరణ్ మాట్లాడుతూ ఎస్సీలుగా పుట్టాలని ఎవరికైనా ఉంటుందా అని దారుణంగా మాట్లాడిన చంద్రబాబు పంచన చేరిన పార్థసారథి, నేడు ఎస్సీల పట్ల మొసలి కన్నీరు కారుస్తున్నారని ధ్వజమెత్తారు. ఎవరి వ్యక్తిత్వం ఏమిటో నియోజకవర్గ ప్రజలకు తెలుసని, ఎమ్మెల్యే ప్రతాప్‌ను నోటికి వచ్చినట్లుగా మాట్లాడితే ఎస్సీలు చూస్తూ ఊరుకోరని హెచ్చరించారు. పెనమలూరులో రెండు పార్టీలకు పనికిరాని వ్యక్తివి కాబట్టే దిక్కు తోచక అక్కడి నుంచి నూజివీడు వచ్చావని, ఇక్కడ మాత్రం పనికివస్తావా అని వారు ప్రశ్నించారు. మంత్రి పదవి ఇవ్వలేదని అధికార దాహంతో పార్టీ మారావే తప్ప ప్రజల కోసం కాదని ధ్వజమెత్తారు. బీసీగా ఉన్న ఇన్‌చార్జికి అన్యాయం చేసిన వ్యక్తివి ఎస్సీలకు అన్యాయం జరిగిందని అనడం నీ దిగజారుడి వ్యక్తిత్వానికి నిదర్శనమని దుయ్యబట్టారు. ఎస్సీలను జిల్లా పరిషత్ వైస్ చైర్మన్‌గా, మున్సిపల్ వైస్ చైర్మన్‌గా, జెడ్పీటీసీగా, జనరల్ కేటగిరిలో కౌన్సిలర్లుగా, ఎంపీటీసీలుగా, సర్పంచ్‌లుగా చేసిన గొప్ప నాయకుడు ప్రతాప్ అప్పారావు అని, ఆయన గురించి మాట్లాడే అర్హత ఎంతమాత్రం లేదన్న విషయం పార్థసారథి గుర్తెరగాలన్నారు. వైఎస్సార్ సీపీ నుంచి ఎమ్మెల్యేగా ఉండి ఆపార్టీకి, ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయకుండా టీడీపీ అభ్యర్థిగా ఇక్కడ తిరగడాన్ని బట్టే పార్థసారథికి ఏమాత్రం నైతిక విలువలు న్నాయో నియోజకవర్గ ప్రజలందరికి అర్థమైందన్నారు. ముందు వాస్తవాలు తెలుసుకొని మాట్లాడాలని, ఎవరో కాగితంపై రాసి ఇచ్చిన దానిని చదివితే అభాసుపాలుకాక తప్పదని హెచ్చరించారు. సమావేశంలో కౌన్సిలర్ కొడవటి రాంబాబు, దళిత నాయకులు కంభాల రాంబాబు, తలారి సతీష్, చేబత్తిన మున్నా, కంభాల దాను, హరికోటి ప్రసాద్, బర్రే చంద్రశేఖర్, కశ్లేపల్లి ఆదినారాయణ, ఉదయగిరి కృపారావు తదితరులు పాల్గొన్నారు.



నూజివీడులోని ఎమ్మెల్యే కార్యాలయంలో మాట్లాడుతున్న ప్రజాప్రతినిధులు, దళిత నాయకులు

వైభవంగా బాలరావమ్మ తల్లి ఉత్సవాలు

ఆగిరిపల్లి: మండలంలోని తోటపల్లి, ఆగిరిపల్లి, కనసానపల్లి గ్రామాల్లో కొలువై ఉన్న దుగ్గిరాల బాలరావమ్మ తల్లి మాఘ పౌర్ణమి తిరునాళ్లు వైభవంగా జరిగాయి. ఆఖరి రోజు శనివారం అమ్మవారిని దర్శించుకునేందుకు అధిక సంఖ్యలో భక్తులు తరలి వచ్చారు. ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీ చైర్మన్ వీరంకి వీరాంజనేయులు ఎమ్మెల్యేను శాలువాతో సత్కరించారు. నూజివీడు నియోజకవర్గ ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలని అమ్మవారిని కోరుకున్నట్టు ఎమ్మెల్యే పేర్కొన్నారు. తోటపల్లి ఆలయంలో విశేష పూజలు అర్చకులు సుబ్బారావు ఆధ్వర్యంలో నిర్వహించినట్లు ఈఓ శ్రీనివాస్ తెలిపారు. మూడు గ్రామాల్లో అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు బారులుతీరారు. ధ్వజ స్తంభాల వద్ద మహిళా భక్తులు పాలపొంగళ్లు సమర్పించారు. ఆగిరిపల్లి, తోటపల్లిలో సంతానం కలగాలని మహిళా భక్తులు ప్రాణాచారం పట్టారు. ఆలయాల వద్ద సాంస్కృతిక కార్యక్రమాలు, అన్నదానాలు జరిగాయి. ఆగిరిపల్లి అమ్మవారిని విశేషంగా అలంకరించారు. ఉత్సవాల్లో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరుగకుండా ఎస్ఐ చంటిబాబు, సిబ్బంది పటిష్ట బందోబస్తు నిర్వహించారు. మండలంలోని మూడు గ్రామాల్లో బాలరావమ్మ తల్లి ఉత్సవాలు ఒకేసారి జరగడం విశేషం. తోటపల్లిలో అన్నదాన కార్యక్రమాన్ని వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు బెజవాడ రాంబాబు, పీఏసీఎస్ అధ్యక్షుడు సింహాద్రి నాగబాబు ప్రారంభించారు. కనసానపల్లి, ఆగిరిపల్లిలో కూడా అన్నదాన కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



దుగ్గిరాల బాల రావమ్మను దర్శించుకున్న ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు



ప్రత్యేక అలంకరణలో బాలరావమ్మ

విద్యార్థులు కష్టపడి చదవాలి

చాట్రాయి: విద్యార్థులు కష్టపడి చదివితే అన్ని రంగాల్లో రాణిస్తారని వికాస్ విద్యాసంస్థల అధినేత ఎన్. నర్సిరెడ్డి అన్నారు. శనివారం చాట్రాయి వికాస్ కాలేజీలో సీనియర్ ఇంటర్ విద్యార్థులు నిర్వహించిన ఫేర్‌వెల్ పార్టీలో ఆయన పాల్గొని మాట్లాడారు. మారుతున్న విద్యావ్యవస్థకు అనుగుణంగా విద్యార్థులు చదువుల్లో ప్రతిభను చూపాలని, చదువుల్లో పోటీతత్వం అలవర్చుకోవాలని ఆయన సూచించారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రామ్మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు బహుమతులు అందిస్తున్న నర్సిరెడ్డి

వైభవంగా నాగేంద్రస్వామి ఆలయ ప్రతిష్ఠ మహోత్సవం

ముసునూరు: గోపవరం శివారు నాగేంద్రపురంలోని వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర (నాగేంద్ర) స్వామి ఆలయ పునః ప్రతిష్ఠ, విగ్రహాలు, శిఖరాల ప్రతిష్ఠ శనివారం వైభవంగా జరిగింది. వైదిక కార్యక్రమాల అనంతరం స్వామివారి దివ్య దర్శనం కల్పించారు. అనంతరం శాంతి కల్యాణం, కంకణ విమోచనం తదితర క్రతువును శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో 20 వేల మంది భక్తులకు అన్నదానం చేశారు. అనంతరం స్వామివారు పుష్పమాలాంకృతులై గ్రామ వీధులకు ఊరేగింపుగా తరలివెళ్లి భక్తులకు దర్శనమిచ్చారు.

శాస్త్రీయ దృక్పథాన్ని అలవరచుకోవాలి

గంపలగూడెం: విద్యార్థులు శాస్త్రీయ దృక్పథాన్ని అలవరచుకోవాలని జన విజ్ఞాన వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి ఎల్. గంగాధర్ అన్నారు. సైన్స్ మాసోత్సవాల్లో భాగంగా శనివారం మండలంలోని తోటమూల గీతాంజలి, గంపలగూడెం లిటిల్ ఏంజిల్స్ ఉన్నత పాఠశాలల్లో నిర్వహించిన సైన్స్ అవగాహనా కార్యక్రమాల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. కాలానుగుణంగా వచ్చే మార్పుల దృష్ట్యా శాస్త్ర, సాంకేతిక రంగాల్లో పరిజ్ఞానాన్ని విద్యార్థులు ఉపయోగించుకొని తమ జీవితాలకు మంచి బాట వేసుకోవాలన్నారు. మూఢనమ్మకాలకు దూరంగా ఉంటూ విజ్ఞానాన్ని పెంచుకోవాలని చెప్పారు. అప్పుడే పోటీ ప్రపంచంలో రాణించగలుగుతారన్నారు. జన విజ్ఞాన వేదిక జిల్లా కార్యదర్శి ఎం. రాంప్రదీప్, ప్రతినిధులు వై. వెంకటరెడ్డి, పి. రమేష్, ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

దివ్యాంగ బాలలను ఆదరించాలి

ముసునూరు: దివ్యాంగ బాలలను ఆదరించాలని రమణక్కపేట మెయిన్ ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం లోకరాజు అన్నారు. శనివారం సమగ్ర శిక్షా అభియాన్ ముసునూరు మండల విభాగం ఆధ్వర్యంలో భవిత కేంద్రానికి హాజరుకాలేని దివ్యాంగ బాలల తల్లిదండ్రులకు వారి ఇంటి వద్దనే అవగాహన కల్పించారు. ఫిజియో థెరపిస్ట్ జి.ప్రశాంతి దివ్యాంగ బాలలకు ఫిజియో అభ్యాసనాలు చేయించారు.

విద్యార్థులకు ఈ-స్లేట్స్ అందజేత

రమణక్కపేట (ముసునూరు): విజయవాడ పవర్‌గ్రిడ్ సబ్‌స్టేషన్ సీనియర్ జనరల్ మేనేజర్ నాగ మోహనరావు రమణక్కపేట హైస్కూల్లో శనివారం మూడో తరగతి విద్యార్థులు 20 మందికి ఈ–స్లేట్స్ అందజేశారు. ఐదో తరగతి విద్యార్థులకు పెద్ద బాల శిక్ష పుస్తకాలు, పంచతంత్ర కథల పుస్తకాలు పంపిణీ చేశారు. రమణక్కపేట హైస్కూల్ హెచ్‌ఎం రామకృష్ణారావు పాల్గొన్నారు.

పాడి రైతులకు వైద్య పరీక్షలు

ఆగిరిపల్లి: గుండెకు సంబంధించిన వైద్య పరీక్షలను పాడి రైతులకు ఉచితంగా చేస్తామని డాక్టర్ వరుణ్ అన్నారు. శనివారం చిన్నగిరిపల్లి, నరసింగపాలెంలోని పాడి రైతులకు కృష్ణా మిల్క్ యూనియన్, వరుణ్ కార్డియాక్ అండ్ సైన్సెస్, రాధా లక్ష్మి హార్ట్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో విజయవాడలో గుండెకు సంబంధించిన పరీక్షలు, యాంజియోగ్రామ్ పరీక్షలు ఉచితంగా నిర్వహించారు. భవిష్యత్తులో పాడి రైతులకు ఆరోగ్య పరిస్థితిని బట్టి ఉచితంగా గుండెకు ఆపరేషన్ చేస్తామని డాక్టర్ వరుణ్ తెలిపారు.

బైక్ ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

ఇబ్రహీంపట్నం: స్థానిక సంగమం రోడ్డులో శనివారం రాత్రి జరిగిన బైక్ ప్రమాదంలో ఇద్దరు యువకులు తీవ్రంగా గాయపడ్డారు. ఫెర్రీకి చెందిన తోట పార్థసారథి, తోట నాగరాజు ఇబ్రహీంపట్నం నుంచి కృష్ణానది ఒడ్డున ఉన్న సంగమం ప్రాంతానికి బైక్‌పై బయలుదేరారు. బైక్ అదుపుతప్పి డివైడర్‌కు ఢీకొట్టారు. ప్రమాదంలో ఇద్దరూ గాయపడ్డారు. బాధితులను 108 వాహనంలో విజయవాడ ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.

టీడీపీ నేతల ఎడముఖం.. పెడముఖం

తిరువూరు: తిరువూరు నియోజకవర్గ తెలుగుదేశం అభ్యర్థిగా కె.శ్రీనివాసరావును అధిష్టానం ప్రకటించడంతో ఆ పార్టీ నేతలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. శనివారం తనకు టికెట్ ఖరారైన వెంటనే శ్రీనివాసరావు ఎస్ఆర్ టవర్స్ వెనుక ఉన్న టీడీపీ కార్యాలయానికి వెళ్లి నియోజకవర్గ ఇన్‌చార్జి శావల దేవదత్‌ను కలిసేందుకు ప్రయత్నించారు. అప్పటికే తనకు జరిగిన అన్యాయాన్ని తెలియజేయడానికి దేవదత్ పాత్రికేయుల సమావేశం నిర్వహించేందుకు సిద్ధమవుతున్న తరుణంలో కొలికపూడి శ్రీనివాసరావును చూసిన ఆయన అసహనంతో బయటికి వెళ్లిపోయారు. కొద్దిసేపు వేచిచూసిన శ్రీనివాసరావు కూడా తన అనుచరులతో కలిసి నిష్క్రమించారు. నాలుగేళ్లుగా అనేక కష్టనష్టాలకోర్చి పార్టీ కార్యాలయం ఏర్పాటుచేసి కార్యక్రమాలు నిర్వహిస్తుంటే అధిష్టానం కనీసం సమాచారం ఇవ్వకుండా టికెట్ వేరొకరికి కేటాయించడం శోచనీయమని దేవదత్ వాపోయారు.



తిరువూరు టీడీపీ కార్యాలయానికి శ్రీనివాసరావు రావడంతో అసహనంతో బయటికి వెళ్లిపోతున్న దేవదత్

బహిరంగ వేలము ప్రకటన

కృష్ణాజిల్లా సహకార కేంద్రబ్యాంక్ లిమిటెడ్, మచిలీపట్నంకు చెందిన ఆగిరిపల్లి మండలం, అనంతసాగరము గ్రామములోగల ఈ క్రింది షెడ్యూల్ దాఖల ఆస్తిని బహిరంగవేలము వేయబడును.

ఆర్.ఎస్.నెం. 130లోగల 2 ఎకరాల 40 సెంట్లు భూమి **తూర్పు** : వేమారెడ్డి సీతారామయ్య భూమి, **పడమర** : విజయవాడ రాజుగారి భూమి, **దక్షిణం** : మూల్పూరి లక్ష్మణస్వామి గారి భూమి, **ఉత్తరం** : వేమారెడ్డి గోవర్ధనరావు గారి భూమి సరిహద్దులుగా గల భూమి ది. 29-2-2024న ఉదయం 11 గం॥లకు కృష్ణాజిల్లా, సహకార కేంద్రబ్యాంక్, నూజివీడు నందు గల బ్రాంచి నందు బహిరంగవేలము వేయబడును. ఆసక్తిగల పాటదారులు పాల్గొనవలసినదిగా కోరడమైనది.

వివరములకు : మేనేజర్, కె.డి.సి.సి. బ్యాంక్, నూజివీడు. ఫోన్ : 99496 88353

సమయం : ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 5 గంటల మధ్య సంప్రదించగలరు.